సాక్షి ఏలూరు

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



నేడు జాతీయ లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా శనివారం కోర్టులున్న అన్ని ప్రదేశాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. 8లో ▸



ఘనంగా సామూహిక వ్రతాలు

ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. 8లో ▸

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్



భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఫెన్సింగ్ సెలెక్షన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభ మవుతాయి. 8లో

న్యూస్‌రీల్

రాట్నాలమ్మ సన్నిధిలో..



అమ్మవారిని దర్శించుకుంటున్న కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ వారిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఆర్డీఓ కె.పెంచల కిషోర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధాన అర్చకులు పావులూరి వీరివెంకట రామసత్యనారాయణ శర్మ వీరికి మర్యాదపూర్వక స్వాగతం పలికారు. ఆలయ కమిటీ చైర్మన్ చల్లగొల్ల వెంకటేశ్వరరావు, ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఆలయ ఈఓ ఎన్.సతీష్ కుమార్ వారి వెంట ఉన్నారు.

డీపీఓ ఆకస్మిక తనిఖీ



సచివాలయంలో పరిశీలిస్తున్న డీపీఓ

పెదవేగి: విజయరాయి గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాట్నాలకుంటలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన ఆయన తిరుగుప్రయాణంలో సచివాలయాన్ని సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. ఈ–గ్రామస్వరాజ్ ప్రగతి, నగదురహిత చెల్లింపులపై సిబ్బందిని ఆరాతీశారు. స్పందన ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని సూచించారు. సచివాలయంలో పథకాల డిస్‌ప్లే బోర్డులను పరిశీలించారు. విస్తరణ అధికారి బి.శ్రీనివాసులు, కార్యదర్శులు ఎం.నీరజ, వలపుల సౌజన్య పాల్గొన్నారు.

వచ్చేనెల నుంచి ధాన్యం సేకరణ : జేసీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం సేకరణలో వచ్చేనెల నుంచి ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని జిల్లా నియామక కమిటీ ద్వారా ఎంపిక చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాలకు సాంకేతిక సహాయకుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వీరి కాలవ్యవధి రెండు నెలలపాటు ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక సహాయకులు రైతుల పొలానికి వెళ్లి ధాన్యాన్ని సేకరించి, విశ్లేషించి ధాన్యం నాణ్యతా ప్రమాణాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలని, అలాగే ధాన్యం, గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాల వివరాలను డేటా ఎంట్రీ ఆపరేటర్లు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, హెల్పర్ ధాన్యం కొనుగోలు పూర్తి ప్రక్రియలో సాంకేతిక సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు సహాయకుడిగా ఉంటారని తెలిపారు. జిల్లాలోని అర్హత గల అభ్యర్థులు http://eluru.ap.gov.in/notice&category/recruitment/ ద్వారా వివరాలు తెలుసుకొని, ఈనెల 11 నుంచి 18లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

నిబంధనల మేరకు ఓటర్ల జాబితా తయారీ

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటర్ల పేర్లు పునః పరిశీలన, విచారణ ప్రక్రియ పూర్తయ్యిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమై పలు అంశాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి పక్కాగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో మరోసారి పరిశీలన, క్షేత్రస్థాయిలో విచారణ ప్రక్రియ చేపట్టామన్నారు. రాజకీయ పార్టీల ఫిర్యాదుల మేరకు ఓట్ల పునః పరిశీలన చేశామన్నారు. క్షేత్రస్థాయిలో నిశిత పరిశీలన, విచారణ తదుపరి మృతులు, శాశ్వత వలసలు, తదితర కారణాలతో ఉన్నవారిని తొలగించామన్నారు. పొరపాట్లు, సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావచ్చన్నారు. కొత్తగా లంకలో ఒకటి, భీమవరం టిడ్కో హౌసింగ్ వద్ద మరొకటి రెండు పోలింగ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదలను పంపామని కలెక్టర్ తెలిపారు. ఈవీఎం గోడౌన్ మార్పుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. ఎన్నికల సూపరింటెండెంట్ లక్కు నరసింహారావు, కామన నాగేశ్వరరావు, కోమటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువగళం.. దాడుల పర్వం

- ప్రతిచోటా రెచ్చగొట్టే ప్రసంగాలు
- ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రిపై అడ్డగోలు విమర్శలు
- నూజివీడు, మందలపాక, భీమవరంలో విధ్వంసకాండ
- ముగ్గురు పోలీసులతో సహా 16 మందికి గాయాలు
- ఉమ్మడి పశ్చిమలో ముగిసిన లోకేశ్ పాదయాత్ర





భీమవరం ఇందిరమ్మ కాలనీలో దాడులు చేస్తున్న టీడీపీ శ్రేణులు (ఫైల్), దాడిలో గాయపడిన బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కవ్వింపు చర్యలు.. అడ్డగోలు రీతిలో అసభ్యపద జాలంతో దూషణలు.. అనంతరం దౌర్జన్యాలు.. ప్రశ్నిస్తే దాడులు.. ఇది తెలుగుదేశం పార్టీ నాయకుడు నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సాగిన తీరు. జిల్లాలోకి ప్రవేశించినప్పటి నుంచి ప్రతిచోటా లోకేష్ రెచ్చగొట్టేలా ప్రసంగించడం, యువగళం వలంటీర్లు రోడ్లపై అధికార పార్టీ ఫ్లెక్సీలు కనిపిస్తే చించివేయడం, రాళ్లు విసరడం, దాడులకు తెగబడుతూ జిల్లాలో మొదటి విడత యాత్ర ముగించారు. లోకేష్ పాదయాత్రగా గత నెల 24వ తేదీన నూజివీడు నియోజకవర్గం మీర్జాపురంలో ప్రవేశించి ఏలూరు జిల్లాలో యాత్ర ప్రారంభించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 16 రోజుల పాటు గోపాలపురంతో సహా 9 నియోజకవర్గాల్లో పాదయాత్ర నిర్వహించారు. ప్రజలను కలిసి కరచాలనం చేసి, కష్టసుఖాలు వినడం, ప్రతిఒక్కరినీ ఆత్మీయంగా పలకరించడం ఇలాంటి వాటికి దూరంగా భారీ సొంత రక్షణ వలయం ఏర్పాటు చేసుకుని చేతులు ఊపుకుంటూ వేగంగా.. మొక్కుబడిగా యాత్ర నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, స్థితిగతులు పట్టించుకోకుండా సభలు పెట్టించడం, భారీగా ఖర్చు పెట్టి జనాలను రప్పించడం, అడ్డగోలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యేలను దూషించడమే అజెండాగా యాత్ర సాగించారు. మొక్కుబడిగా సాగిన యాత్రను కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కేడర్ కూడా చాలా లైట్‌గా తీసుకోవడంతో చాలాచోట్ల పేలవంగా ముగిసింది. యువగళం యాత్రకు జనసమీకరణ కూడా టీడీపీ శ్రేణులకు ప్రయాసగా మారింది.

ఖర్చు చేసినా ఫలితం శూన్యం

నూజివీడు, చింతలపూడి, పోలవరం, గోపాలపురం, ఉంగుటూరు, ఉండి, భీమవరం, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో లోకేశ్ పాదయాత్ర సాగింది. టికెట్ ఆశిస్తున్న ఆశావహులకు, నియోజకవర్గ సమన్వయకర్తలకు ఖర్చులను విభజించి అప్పగించారు. బహిరంగ సభకు జనసమీకరణ ఖర్చుల బాధ్యతలు ఒకరికి, నియోజకవర్గంలో ఎన్ని రోజులు యాత్ర సాగితే అన్ని రోజులు రెండు పూటలా జనం ఉండేలా జనసమీకరణ చేసే బాధ్యత మరొకరికి అప్పగించారు. అయితే ఎక్కువ నియోజకవర్గాల్లో జనసమీకరణ విషయంలో నేతలు పెద్దగా పట్టించుకోకపోవడంతో మొక్కుబడిగానే యాత్ర సాగింది.

స్పందన లేక దాడులు



యువగళం పాదయాత్రకు స్పందన లేకపోవడంతో తీవ్ర అసహనంతో సంచలన దాడులు చేస్తున్నారు. భీమవరం ఘటనలో 44 మంది యువగళం వలంటీర్లను పోలీసులు అరెస్టు చేశారు. 13 మంది నేతలపై కేసులు నమోదు చేశారు. దీనిపై పోలీసు శాఖ సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తుంది. ప్రశాంత భీమవరంలో విధ్వంసం సృష్టించిన లోకేశ్ కనీసం పల్లెత్తు మాట్లాడకుండా వెళ్లిపోవడం సిగ్గుమాలిన చర్య.

– గ్రంధి శ్రీనివాస్, భీమవరం ఎమ్మెల్యే

దాడులు.. దౌర్జన్యాలు

- ప్రతి నియోజకవర్గంలోనూ యువగళం బ్యాచ్ రెచ్చిపోయారు. గత నెల 25న నూజివీడు నియోజకవర్గంలోని తుక్కులూరు గ్రామంలో రోడ్డుపై వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని ఉన్న అభిమానిపై 20 మంది యువగళం వలంటీర్లు దాడి చేసి గాయపరిచారు.
- చింతలపూడి పాదయాత్ర చేరుకోగానే అధికార పార్టీ ఎమ్మెల్యే ఎలీజా కార్యాలయం వద్ద సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండటంతో ఎమ్మెల్యే కార్యాలయంలోని కార్యకర్తలు, స్థానికులు బయటకు వచ్చి జై జగన్ నినాదాలు చేశారు. దీంతో వారిపైకి వెళ్లేందుకు సమాయత్తమవుతుండగా పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఘర్షణకు తావులేకుండా ముగిసింది.
- ఉంగుటూరు నియోజకవర్గం నిడమర్రు మండలం మందలపర్రు చర్చి సెంటరులో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీని చూసిన యువగళం సభ్యులు రెచ్చిపోయి రాళ్లు విసిరారు. స్థానిక యువకుడు, జనాలు ఇదేమి పద్ధతి అని ప్రశ్నించడంతో యువగళం వలంటీర్లు దాడి చేశారు. దాడిలో ముగ్గురు గాయాలపాలయ్యారు.
- యువగళం బృందం భీమవరంలో విధ్వంసకాండ సాగించింది. భీమవరం ప్రధాన సెంటరులో ఏర్పాటుచేసిన వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీపై రాళ్లు, సీసాలు విసిరారు. అనంతరం ఇందిరమ్మకాలనీకి చేరుకోగానే అక్కడ వైఎస్సార్ సీపీ అభిమానులు, స్థానికులపై యువగళం బృందం రెచ్చిపోయింది. రాళ్లు, కర్రలు, రాడ్లతో కొంతసేపు విధ్వంసం సృష్టించి ఇళ్లల్లోకి చొరబడి మరీ దాడులు చేశారు. ముగ్గురు పోలీసులకు, 13 మంది సామాన్యులకు గాయాలయ్యాయి. ఇలా ప్రతిచోట అధికార పార్టీ ఫ్లెక్సీని చూస్తే దాడులు, దౌర్జన్యాలు చేసుకుంటూ లోకేష్ యాత్ర సాగిస్తున్నారు.

‘జగనన్నకు చెబుదాం’కు అపూర్వ స్పందన

- ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం
- 122 అర్జీల స్వీకరణ
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదవేగి: ప్రజాసమస్యలను నేరుగా పరిష్కరించేందుకు మండల స్థాయిలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం గ్రీవెన్స్‌డేకు మంచి స్పందన వచ్చిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాట్నాలకుంట అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి రమణతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేకేసీలో వివిధ సమస్యల పరిష్కారం కోసం 122 మంది అర్జీలను అందజేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు ప్రతి బుధవారం, శుక్రవారం ఆయా మండలాల్లో జగనన్నకు చెబుదాం మండలస్థాయి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో చేపట్టిన జగనన్నకు చెబుదాం తొలి కార్యక్రమాన్ని పెదవేగి మండలంలో ప్రారంభించామని చెప్పారు.

షెడ్యూల్ ఇలా..

ఈనెల 13న చింతలపూడి, 15న ద్వారకాతిరుమల, 20న టి.నర్సాపురం, 22న ఉంగుటూరు, 27న ముసునూరు, 29న కలిదిండి మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.

ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించడంతో పాటు సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు.

సత్వర పరిష్కారానికి..

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ జేకేసీలో అందిన అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్ఆర్ బీమా కింద గ్రామాల్లో నూరుశాతం నమోదయ్యేలా అధికారులు చూడాలని ఆదేశించారు. ఎంపీపీ తాతా రమ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తనకు మూడు చక్రాల వాహనం ఇప్పించాలని పెదవేగి మండలం రాయన్నపాలెంకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు పలగని శ్రీనివాసరావు కలెక్టర్‌ను కోరారు. వేదిక దిగి వచ్చిన కలెక్టర్ అతడి సమస్య తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.
- తనకు బాపిరాజుగూడెంలో ఉన్న వ్యవసాయ భూమిని ఆన్‌లైన్ చేయాలని రాయన్నపాలెంకు చెందిన తాళం ప్రసాద్ అర్జీ అందజేశారు.
- బాపిరాజుగూడెంలో 131 ఎకరాల్లో ఉన్న చెరుకు ఆక్రమణకు గురైందని బొప్పన శ్రీఫణి కుమార్ ఫిర్యాదు చేశారు.
- పెదవేగిలో తనకున్న ఎకరాన్నర వ్యవసాయ భూమి ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాలని కొడాలి రాధాకృష్ణమూర్తి (రాట్నాలకుంట) అర్జీ అందజేశారు.
- తనకు ఇంటి పట్టా అందించాలని గార్లమడుగుకు చెందిన నేరూరి ప్రభావతి కోరారు.
- తన భూమిని సర్వే చేయించేందుకు సహకరించాలని పెదకడిమికి చెందిన పర్వతనేని సుబ్బయ్య అర్జీ అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పటిష్టంగా ‘ఆడుదాం ఆంధ్ర’



జేసీ లావణ్యవేణి

ఏలూరు(మెట్రో): గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో ఆటల పోటీలను నిర్వహిస్తుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. సెట్‌వెల్, క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై నోడల్ అధికారి, జేసీ లావణ్యవేణి శుక్రవారం అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 605 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీలను నిర్వహణకు నెలాఖరు నాటికి ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. గ్రామ సచివాలయాల స్థాయిలో ఎంపీడీఓలు, వార్డు సచివాలయాల స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. దాతలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, స్వచ్ఛంద సంస్థల సేవల వినియోగించుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటిన గ్రామీణ యువతతో పాటు విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా చూడాలన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, యోగా, టెన్నికాయిట్, నడక, పరుగు, లెమన్ స్పూన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాస్థాయిలో ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని చెప్పారు.

షెడ్యూల్ ఇలా..

- 605 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో.. అక్టోబర్ 2 నుంచి 9 వరకు..
- 27 మండల/ 3 మున్సిపాలిటీల స్థాయిలో.. అక్టోబర్ 10 నుంచి 21 వరకు..
- 7 నియోజకవర్గ స్థాయిలో.. అక్టోబర్ 22 నుంచి 27 వరకు..
- ఏలూరు జిల్లాస్థాయిలో.. అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకు..
- రాష్ట్రస్థాయిలో.. నవంబర్ 4 నుంచి 8 వరకు పోటీలు నిర్వహిస్తారు.

ఆర్యవైశ్య మహాసభ ఎన్నికలపై స్టే

జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కమిటీ 2024 వరకు విధులు నిర్వహిస్తుందని, ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వారు ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ‘సాక్షి’తో మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభకు ఎటువంటి సంబంధం లేని మాజీ అధ్యక్షుడు ఒకరు ఆర్యవైశ్య మహాసభ ఎన్నికల కన్వీనర్‌గా పేర్కొంటూ, ఎన్నికలు అంటూ సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో హైదరాబాద్‌లో ఎన్నికలంటూ పేర్కొంటున్నారని, ఈ ప్రకటనలు ఆర్యవైశ్య మహాసభ బైలాకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆర్యవైశ్యులను తప్పుదోవ పట్టించేలా ఉన్న ప్రకటనలను తాము ఖండిస్తున్నామన్నారు. ఈ ప్రకటనల నేపథ్యంలో తాము కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. కోర్టు సైతం ఆర్యవైశ్య మహాసభ బైలాకు విరుద్ధంగా ఉన్నందున ఎన్నికల ప్రక్రియపై స్టే ఇచ్చిందని వివరించారు. మహాసభ ఔన్నత్యానికి మచ్చ తెచ్చేలా కొందరు చేపడుతున్న ఈ చర్యల పట్ల ఆర్యవైశ్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. 10, 11 తేదీల్లో జరిగే ఎన్నికలకు ఎవరూ హాజరుకావద్దని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న కమిటీ 2024 మార్చి వరకు కొనసాగుతుందని, అనంతరం రాష్ట్ర ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. తాము అధికారికంగా ప్రకటించేంత వరకు ఎటువంటి ఎన్నికలూ జరగవని, అందుకు విరుద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తే అది కోర్టు ధిక్కారమే అవుతుందని హెచ్చరించారు.

ఖరీఫ్ సాగు ఆశాజనకం

- 1.35 లక్షల ఎకరాల్లో వరినాట్లు పూర్తి
- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్. చిత్రంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో 1.48 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఇప్పటివరకు 1.35 లక్షల ఎకరాల్లో (91.23 శాతం)వరినాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీటి పారుదల, వ్యవసాయ సలహా మండలి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగు పరిస్థితి ఆశాజనకంగా ఉందన్నారు. గోదావరి పశ్చిమ డెల్టా ఆయకట్టుకు 8.23 టీఎంసీలు, తాగునీరు, పరిశ్రమల అవసరాలు కలిపి మొత్తంగా 8.43 టీఎంసీల నీరు అవసరముందన్నారు. అయితే ఇప్పటివరకు 6.734 టీఎంసీల నీటిని వినియోగించామన్నారు. ఇరిగేషన్ ఏఈలు, డీఈల పర్యటన వివరాలు అందించాలని ఆదేశించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, వైద్య శిబిరాల సమాచారాన్ని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలన్నారు. మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణానికి సంబంధించి జీఎస్టీ తగ్గింపునకు ప్రతిపాదనలు ఆమోదం పొందిన కారణంగా వెంటనే వాటి నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

శివారుకు సాగునీరు

జెడ్పీచైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గోదావరి, కృష్ణా డెల్టాలకు శివారుగా ఉన్న పెదపాడు మండల ప్రాంతానికి సాగునీరు అందించడంలో ప్రాధాన్యమివ్వాలన్నారు. సొసైటీల ద్వారా మంచి గోనె సంచులు కొనుగోలు చేయాలని సూచించారు. శాసన మండలి సభ్యుడు వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ పంట బోర్లపై ఆధారపడి సాగుచేసే రైతులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పగటిపూట తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఏపీఈపీడీసీఎంఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు సమాధానమిచ్చారు. పరిశ్రమలకు విద్యుత్ కోత లేదనే విషయాన్ని పారిశ్రామిక యాజమాన్యాలకు తెలిసేలా ప్రకటన విడుదల చేయాలని ఎమ్మెల్సీ రవీంద్రనాథ్ కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇరిగేషన్ ఏఈ చిలకంపాడు విషయంలో సరైన రీతిలో స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, చర్యలు తీసుకోవాలన్నారు. చెట్టున్నపాడు, ఆగడాలలంక తదితర ప్రాంతాలకు సాగునీరు అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ధాన్యం వాహనాలకు ట్రాకింగ్

జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ముందస్తు ధాన్యం కొనుగోలు ఏర్పాట్లకు అంగీకారం తెలిపారు. ధాన్యం సేకరణ వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ యోచనలో ఉన్నామన్నారు. ప్రతి ఆర్‌బీకే పరిధిలో 20 నుంచి 30 వాహనాలను అందుబాటులో ఉంచుతామన్నారు.

జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో యూరియా కొరత లేదని ముందుగా ఆర్‌బీకేలకు ప్రాధన్యమిస్తామని, డీసీఎంఎస్ రాతపూర్వకంగా కోరితే సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో ఆయిల్‌పామ్ మొక్కల కొరత లేదని ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్ తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు చిట్టూరి వెంకటేశ్వరరావు, యేలిశెట్టి బాబ్జి, పల్లె రవీంద్రరెడ్డి, వైఎస్‌పీ సత్యనారాయణ, వి.హరిబాబు ఆయా అంశాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ శ్రీపూజ, ఇరిగేషన్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి క్షేత్రంలో ఉట్ల ఉత్సవం



క్షేత్రంలోని ఎస్వీ వేడుక ఫంక్షన్ హాలు సమీపంలో ఉట్టి కొడుతున్న యువకులు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఉట్ల పండుగ, శ్రీవారి తిరువీధి సేవ భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. స్వామివారి కల్యాణ మండపం వద్ద, క్షేత్రంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉట్లను యువకులు ఉత్సాహంగా కొట్టారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



మృతుడు బొప్పన నరేష్

తాడేపల్లిగూడెం: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో కడకట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి శుక్రవారం ఒక యువకుడు మృతిచెందాడు. మృతుడి వద్ద ఉన్న బ్యాగ్‌లో సర్టిఫికెట్లను పరిశీలించగా.. అతను చింతలపూడి మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. నన్నయ్య విశ్వవిద్యాలయంలో డిగ్రీ పూర్తి చేసినట్టు సర్టిఫికెట్లలో ఉంది.

నేడు ఫెన్సింగ్ సెలెక్షన్స్

సాక్షి, భీమవరం: కాకినాడ జెడ్పీ హాల్లో రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల బాలికల ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహిస్తారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్‌వీ కృష్ణమోహన్ చెప్పారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఫెన్సింగ్ సెలెక్షన్స్ శనివారం భీమవరం ఫెన్సింగ్ క్లబ్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 63042 52121, 96802 34566 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

శ్రీవారి క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

వేడుకలో పాల్గొన్న 12 వందల మందికి పైగా మహిళలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నేత్రపర్వంగా జరిగాయి. శ్రావణమాసంలో నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయ అనివెట్టి మండపంలో దేవస్థానం నిర్వహించిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 12 వందల మందికి పైగా మహిళలు ఈ వ్రత వేడుకలో పాల్గొని, వరలక్ష్మీ దేవిని కొలిచారు. తొలుత విశేషంగా అలంకరించిన అమ్మవారిని ఆలయం నుంచి తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివెట్టి మండపం వద్దకు వెండి తొళక్క వాహనంపై తీసుకొచ్చి, అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై వేంచేపు చేశారు. ఆ తరువాత అర్చకులు, పండితులు అమ్మవారి ఉత్సవ మూర్తికి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సతీమణి భాగ్యలక్ష్మి అమ్మవారికి పూలు, పండ్లను అందజేయగా, వ్రత వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేళతాళాలు,



వ్రత వేడుకలో అమ్మవారికి హారతులిస్తున్న అర్చకులు

మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ దేవస్థానం అందించిన పూజాసామగ్రితో, వేదిక ముందు కూర్చున్న మహిళలతో అర్చకులు, పండితులు, పురోహితులు, ఆగమ విద్యార్థులు ఈ



మహిళా భక్తులతో నిండిన అనివేటి మండపం

వ్రత వేడుకను కన్నులపండువగా జరిపించారు. శ్రీవారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చిన మహిళా భక్తులు సైతం ఈ వ్రతాన్ని ఆచరించారు. ఇందులో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, అలాగే రవికలు, ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. ఎంతో భక్తి ప్రపత్తులతో జరిగిన ఈ వ్రత వేడుకలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు మానుకొండ సుబ్బారావు,



అమ్మవారిని వెండి తొళక్క వాహనంపై వేదిక వద్దకు తీసుకొస్తున్న అర్చకులు, భక్తులు



ఆచంట అనసూయ సురేష్ దంపతులు, ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, రావిపాటి లక్ష్మణస్వామి, సూపరింటిండెంట్ వాసు, సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను, ఎలక్ట్రికల్ ఏఈ అమాం శివ తదితరులున్నారు.

ఇంటర్న్‌షిప్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఎంపిక



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన మెటీరియల్ అండ్ మెటలర్జికల్ ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న పది మంది విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారు. కాకినాడలోని శ్రీ భవాని కాస్టింగ్ లిమిటెడ్‌లో ఒక ఏడాది కాలానికి వీరు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికకాగా, ఈ కాలంలో కంపెనీ వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల స్టైఫండ్ అందజేయనుంది. ఇంటర్న్‌షిప్ ముగిసిన అనంతరం అదే కంపెనీ విద్యార్థులకు టెక్నికల్ ఇంటర్వ్యూను నిర్వహించి అదే కంపెనీలో ఉద్యోగావకాశాలను కల్పించనుంది. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏవో పీ ప్రదీప్, ఎంఎంఈ విభాగాధిపతి పీ మధుసూదన్, డీన్ అకడమిక్ లక్ష్మణ్, అధ్యాపకులు తదితరులు అభినందించారు.

ఏసీబీ వలలో ఆర్ఐ



మండవల్లిలో ఆర్ఐని పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ శరత్‌బాబు, సీఐలు

మండవల్లి: ఏలూరు జిల్లా మండవల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. తన ఇంటి వద్దే రూ.38 వేలు లంచం తీసుకుంటుండగా దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అయ్యవారిరుద్రవరం గ్రామానికి చెందిన చిన్ని వెంకట సోమేశ్వరరావుకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయనకు ఆరు ఎకరాల 15 సెంట్ల పొలం ఉంది. దానిని తన సంతానానికి చెందేలా వీలునామా రాశారు. ఆయన కుమార్తె బసవ రాణికి వచ్చిన ఆస్తిలో, ఆమె కుమారుడు బోయిన సాయి కిరణ్‌కు వచ్చిన పొలం పేరు మార్పు చేయటానికి మండవల్లి ఆర్ఐ కె.పద్మరోజను ఆశ్రయించాడు. అతనికి వచ్చిన ఎకరం 25 సెంట్ల పొలానికి పేరు మార్పిడికి ఎకరానికి రూ.30 వేలు చొప్పున మొత్తం రూ.38 వేలు ఆర్ఐ డిమాండ్ చేశారు. దీంతో సాయికిరణ్ ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు సాయికిరణ్ శుక్రవారం రూ.38 వేలు నగదు తీసుకొని ఆర్ఐ ఇంటికి వచ్చాడు. ఆర్ఐ ఆ నగదు తీసుకుంటుండగా అప్పటికే అక్కడ కాపు కాసి ఉన్న ఏసీబీ అధికారులు దాడిచేసి ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విజయవాడకు చెందిన ఏసీబీ డీఎస్పీ శరత్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడిలో సీఐలు ఏ భాస్కర్, కే యేసుబాబు, కే నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



టి.నరసాపురం : మండలంలోని రాజుపోతేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

నేడు జాతీయ లోక్ అదాలత్

33 బెంచీల ఏర్పాటు



జి.రాజేశ్వరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9న కోర్టులున్న అన్ని ప్రదేశాలలో జాతీయ లోక్ అదాలత్‌ను ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో శుక్రవారం ఆమె మాట్లాడారు. రాజీయోగ్యమైన అన్ని కేసుల పరిష్కారం నిమిత్తం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 33 బెంచీలు ఏర్పాటు చేయగా వీటిలో ఒక్క ఏలూరులోనే 8 బెంచీలు ఉన్నాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,952 వరకూ రాజీ యోగ్యమైన కేసులు గుర్తించామని.. వీటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులు మరో 2,746 కేసులను గుర్తించామన్నారు. ఇంతవరకూ పలు ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహించి 381 కేసులు పరిష్కరించామన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బుల్లి కృష్ణ మాట్లాడుతూ ఎక్సైజ్ కేసులను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. కాంపౌండ్ ఫీజు చెల్లించి 10 లీటర్ల లోపు ఉన్న కేసులను నిబంధనలకు లోబడి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

నీటమునిగిన ఎద్దెల వాగు వంతెన



పడవలో రాకపోకలు సాగిస్తున్న స్థానికులు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శుక్రవారం 30 అడుగులకు పెరగడంతో వేలేరుపాడు మండలంలో కొయిదా రహదారిలో ఎద్దెల వాగు వంతెన రెండురోజులుగా నీట మునిగే ఉంది. దీంతో దిగువన ఉన్న 16 గిరిజన గ్రామాలకు మండల కేంద్రమైన వేలేరుపాడు నుంచి రాకపోకలు స్తంభించాయి. దిగువ ప్రాంతంలోని కొయిదా, కట్కూరు, కాచారం, తాళ్లగొంది, పూసుగొంది, చిట్టంరెడ్డిపాలెం, ఎడవల్లి, బుర్రెడ్డిగూడెం, టేకూరు, సిద్దారం, కుంకుడుకొయ్యలపాకలు, మరో ఐదు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంతవరకు గత మూడు నెలలుగా ఈ వంతెన నీటమునగడం ఇది ఐదోసారి.

గిరిజన యువత ఆందోళన



కొయ్యలగూడెం మండలం కన్నాపురంలో జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ముందు ఆందోళన చేస్తున్న గిరిజన యువత

కొయ్యలగూడెం: స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగాల తొలగింపు, మానసిక వేధింపులపై గిరిజన యువత శుక్రవారం కన్నాపురం గ్రామంలో ఆందోళన నిర్వహించింది. తొలగించిన ఉద్యోగులకు బాసటగా గిరిజన సంఘాల నాయకులు మద్దతు తెలిపి నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామంలో సుమారు సంవత్సరం క్రితం జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఏజెన్సీ గ్రామాలలోని గిరిజనుల హెల్త్ బులిటెన్ సేకరణ ప్రారంభించింది. దీంతో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, పోలవరం మండలాకు చెందిన గిరిజన యువత ఎనభై మందికి పైగా సంస్థలో రిక్రూట్ చేసుకున్నారు. వివిధ కేటగిరీలలో రూ.14,000 నుంచి రూ.20 వేల వరకు నెల జీతం ప్రకటించారు. ఆ సమయంలో సంవత్సరం పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని యాజమాన్యం పేర్కొన్నట్లు, అగ్రిమెంట్ కూడా రాయించుకున్నట్లు ఆందోళనకారులు తెలిపారు. అర్ధాంతరంగా ఆరు నెలల వ్యవధిలోపే సంస్థ సిబ్బందిని తొలగిస్తూ వచ్చిందని దాని వల్ల ఇప్పటికే ముప్పై మందికి పైగా ఉద్యోగాలు కోల్పోయారన్నారు. తాజాగా మరో ఇరవై మందిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో ఆందోళన బాట పట్టామన్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనకు సంస్థ నుంచి ఏ విధమైన స్పందన రాలేదుసరి కదా సంస్థ రీసెర్చ్ ఫెలో అధికారి సిద్ధార్థ, సూపర్‌వైజర్ దుర్గా దుర్భాషలాడుతూ కించపరిచారని గిరిజన యువతులు పేర్కొన్నారు. రాత్రిళ్ళు విధుల పేరిట సంస్థలో కార్యకలాపాలు చేయిస్తున్నారని, ఆసమయంలో తీవ్ర అవమానాలు, మానసిక వేధింపులకు గురయ్యాయని పేర్కొన్నారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సౌజన్యంతో జార్జ్ ఇన్‌స్టిట్యూట్ పనిచేస్తున్నట్లు రీసెర్చ్ ఫెలో సిద్ధార్థ తెలిపారు. యువతులు సిద్ధార్థ అతనితోపాటు మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేస్తూ ఐటీడీఏ పీఓ సూర్యతేజకు ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదు సరి కదా, ఉద్యోగులతోనే సంస్థలో సొమ్ములు పెట్టుబడులు పెట్టించారని అవి కూడా తిరిగి ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థపై స్థానిక ప్రజాప్రతినిధులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రాత్రిళ్ళు పనిచేయడం గురించి పలుమార్లు గొడవలు చోటు చేసుకున్నాయన్నారు. రెండు రోజుల్లోగా గిరిజన యువతకు న్యాయం చేయాలని అప్పటివరకు సంస్థ కార్యకలాపాలను అడ్డుకుంటామని గిరిజన సంఘం నాయకుడు తెల్లం రామకృష్ణ పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ జీజే విష్ణువర్ధన్ మాట్లాడుతూ విషయం తమ దృష్టికి రాలేదని విచారణ చేస్తున్నామని ఆయన తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో శుక్రవారం ట్రాక్టర్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగుల గంగరాజు(44) గ్రామంలోని ఈదుల చెరువు వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వస్తుండగా అతివేగంతో వచ్చిన ట్రాక్టర్ అతనిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ చెరువు కట్టపై నుంచి కిందకు పడిపోగా డ్రైవర్ ట్రాక్టర్‌పై నుంచి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఫోన్ పే చేశామని చెప్పి మోసగించిన యువకులు

కుక్కునూరు: టెక్నాలజీని ఉపయోగించుకోని కొందరు కేటుగాళ్లు కొత్త రకం దోపిడీకి తెగబడుతున్నారు. ఫోన్ పే చేస్తాం డబ్బులివ్వాలని కోరి ఫోన్‌పే చేయకుండానే చేసినట్టు మెసేజ్ చూయించి పెట్రోల్ బంక్ సిబ్బందిని బురిడి కొట్టించారు. మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఈ ఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ముగ్గురు యువకులు కుక్కునూరు పెట్రోల్ బంక్‌కు వెళ్లారు. బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది వద్దకు వెళ్లి తమ కుటుంబసభ్యులకు ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రికి వెళ్లాలని మూడువేలు ఫోన్‌పే చేస్తాం డబ్బులు కావాలని బతిమిలాడారు. నిజమేనని నమ్మిన పెట్రోల్ బంక్ సిబ్బంది వారి ఫోన్‌పే నెంబర్ ఇచ్చారు. దీంతో ఫోన్ పే నుంచి రూ.3 వేలు కొట్టినట్టు చూపిన యువకులు సిబ్బంది వద్ద మూడు వేలు తీసుకుని జారుకున్నారు. ఆ తరువాత ఫోన్ పే తెరచి చూసిన సిబ్బందికి డబ్బు జమకాలేదు. మోసపోయమని గ్రహించిన సిబ్బంది తలలు పట్టుకున్నారు.

11న అప్రెంటిస్‌షిప్ మేళా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామిక మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఈ నెల 11న అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఏలూరు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి పీ.రజిత ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఈ మేళా ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ఏలూరు, నెల్లూరు, విజయవాడ, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఎస్ఎస్‌సీ మార్కుల మెమో, ఐటీఐ మార్కుల మెమో, ఐడీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ ఫొటోలతో హాజరుకావాలని తెలిపారు. ఇతర వివరాలకు తమ కార్యాలయంలో పని వేళల్లో 08812-230269 నెంబరులో సంప్రదించవచ్చన్నారు.

పాతకక్షల నేపథ్యంలో హత్యాయత్నం

కొయ్యలగూడెం: పాత కక్షల నేపథ్యంలో ఐదుగురు ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం వివరాలు వెల్లడించారు. గోపాలపురం మండలం పెద్దగూడెంకి చెందిన యేల్లా దుర్గాప్రసాద్‌పై తూరపాటి పోచమ్మ, ఆమె సహచరుడు ఈపు వెంకటేశ్ కొయ్యలగూడెం సమీపంలోని పొగాకు బోర్డు వద్ద హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. దుర్గాప్రసాద్ వారి నుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించాడన్నారు. అతడిని హాస్పిటల్ కి తరలించి చికిత్స అందిస్తున్నామని, పోచమ్మ, వెంకటేష్‌కు ఆంజనేయులు, సీరం జయబాబు, కురెళ్ళ నాగేంద్ర సహాయపడ్డారని అన్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.